క్లుప్తంగా


23న ప్రయాగరాజ్‌కు ఆర్టీసీ సర్వీసులు

కాకినాడ సిటీ: ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు కాకినాడ డిపో నుంచి ఈ నెల 23వ తేదీన స్టార్ లైనర్ నాన్ ఏసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఈ బస్సుకు టికెట్ కావల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకో వచ్చన్నారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగరాజ్ చేరుకుంటాయన్నారు. అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసిన తరువాత తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి, క్షేత్రాలు చూపించి తిరిగి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుకుంటా యన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒక్కొక్క టికెట్‌కు రూ.12,200 ధర నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కరప: గ్రామంలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బీడీల నేరెళ్లకు అనారోగ్యంతో ఎడమ కాలు మోకాలు నుంచి కిందివరకు తొలగించగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ద్వారా తెలుసుకున్న విశ్రాంత చీఫ్ లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు రూ. 10 వేలు, గ్రామస్తుడు పేపకాయల దొరబాబు రూ వెయ్యి వంతున ఆర్థికసాయమందించారు. ఆ మొత్తాన్ని శుక్రవారం తాతీలు ఆసుపత్రికి వెళ్లి బాధితుడికి అందజేశారు.


ఘనంగా గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మమ్మ తల్లి

కరప: మండలం సిరిపురం గ్రామ దేవతలైన గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఫిబ్రవరి 21వ తేదీన అమ్మవార్ల తీర్థం జరుపుతారు. ముందురోజు గురువారం రాత్రి గరగ నృత్యాలు, గారడీ, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించారు. సర్పంచ్ నున్న సుజాత, సిరిపురం పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి గోగులమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులుతీర్చుకుని, ప్రసాదాలు స్వీకరించారు.

కేంద్ర బడ్జెట్‌పై నేడు అభిప్రాయ సేకరణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2025- 26 వార్షిక బడ్జెట్‌పై మేధావి వర్గ అభిప్రాయాలను తెలుసుకొనేందుకు శనివారం స్థానిక బోట్‌క్లబ్ ఎదురుగా ఉన్న చోడే అప్పారావు ప్రకృతి ఆశ్రమంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక రామారావుపేటలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మేధావుల అభిప్రాయాలను తెలుసుకొని వాటిని నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ముఖ్య వక్తగా పెద్దిరెడ్డి రవికిరణ్ వ్యవహరిస్తారన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి సెంటర్‌లోని సైన్స్ కంప్యూటర్ కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జంగం బాబ్జీ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. స్టాండర్డ్ చార్టెడ్ కేరీర్ అకాడమీలోని సీఎస్ఆర్ పథకంలో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ట్యాలీ, కంప్యూటర్ అసిస్టెంట్, రిటైల్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై 18 నుంచి 27 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు అర్హులన్నారు. నెల రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99123 00248 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బైక్ చోరీల గుట్టు రట్టు

కాకినాడ రూరల్: తీత లాగితే డొంక కదిలినట్టు వాహనాల తనిఖీలో భాగంగా బైక్‌పై వస్తున్న 17ఏళ్ల బాలుడిని ఇంద్రపాలెం పోలీసులు విచారించగా అతడు దొంగతనాలకు పాల్పడిన బైక్‌ల గుట్టు బయటపడింది. ఎస్సై ఎం.వీరబాబు తెలిపిన వివరాల మేరకు చైన్ స్నాచింగ్, బైక్ చోరీలను అరికట్టే ఉద్దేశంతో శుక్రవారం చీడిగ షై ఓవర్‌పై వాహనాలు తనిఖీ చేపట్టారు. పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన బాలుడు బైక్‌పై వస్తుండగా అతడి తీరు బట్టి అనుమానంతో విచారించగా ఇంద్రపాలెం, సామర్లకోట, కోరంగి, సర్పవరం పీఎస్‌ల పరిధిలో బైక్‌ల చోరీ సంగతి బయటపడింది. నిందితుడి నుంచి రూ.2.8 లక్షల విలువైన ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకుని డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ ఆఫీసరు ముందు హాజరు పరిచినట్టు ఎస్సై వీరబాబు తెలిపారు.

ఆరంభమే భీతిల్లేలా..

- పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- రోడ్లపై తగ్గుతున్న జన సంచారం
- రాత్రి చలి.. పగలు వేడితో విభిన్న వాతావరణం
- సతమతమవుతున్న ప్రజలు



ఉదయం 12 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న కాకినాడ-యానాం రోడ్డులో జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రధాన రహదారి


కాకినాడ సిటీ: ఎండాకాలం పూర్తిగా ప్రారంభం కాకముందే ఉష్ణోగ్రతలు ఊపందుకున్నాయి. మహా శివరాత్రికి ముందే ఎండ వేడికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో ఈ పరిస్థితి నెలకొంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందా అని వారు భీతిల్లుతున్నారు. రెండు రోజులుగా మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకుపైగా నమోదవుతోంది. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ ప్రాంతాల్లో రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో కొంత మార్పు కనిపిస్తోంది. అర్ధ రాత్రి నుంచి చలి తీవ్రతలు, పగటి వేళల్లో ఎండ వేడితో విభిన్న వాతావరణం నమోదవుతోంది. సాధారణంగా ఏటా ఫిబ్రవరిలో నమోదయ్యే ఉష్ణోగ్రతల్లో కంటే ఈ ఏడు 2, 3 డిగ్రీలు ఆదనంగా నమోదవుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తగ్గుముఖం పడుతున్న జన సంచారం

ఎండల వల్ల మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం తగ్గుతోంది. అత్యవసరమైతే తప్ప బయటకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. సాయంత్రం ఐదు గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పుచ్చకాయలకు డిమాండ్

ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండడంతో ఒంటికీ, కంటికీ, మనసుకూ చల్లదనాన్ని ఇచ్చే పుచ్చకాయలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. వీటితో పాటు సేదతీర్చే షర్బత్, మజ్జిగ, లస్సీ, ఫ్రూట్ జ్యూస్ పాయింట్లకు గిరాకీలు పెరుగుతున్నాయి. వీటితో పాటు కూలర్లు, ఏసీల కొనుగోళ్లకు సమాయత్తమవుతున్నారు.



మార్కెట్లో విక్రయిస్తున్న పుచ్చకాయలు

జాగ్రత్తగా ఉండాల్సిందే



ఎండలు పెరిగే కొద్దీ వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వేడి వల్ల శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుంది. చెమట బయటకు వచ్చే మార్గాలు మూసుకుపోతాయి. ఫలితంగా శరీరంలో ఉష్ణస్థితి పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఎండలో వెళ్లేటప్పుడు సూర్యకిరణాలు పడకుండా తలపై టోపీ లేదా తుండుగుడ్డ ధరించాలి. ఇంట్లో చల్లని వాతావరణం ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ పృథ్వీ చరణ్, పట్టణ ఆరోగ్యశాఖాధికారి, కాకినాడ

ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ ప్రసాద్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో బోధనేతర సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించే ఎంఎస్ ఆఫీస్ శిక్షణ శిబిరాన్ని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం ప్రిన్సిపాల్ పరిపాలన కార్యాలయం ఎదుట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర అభ్యసన ద్వారా జ్ఞానం పెరుగుతూ ఉంటుందని, ఏదైనా ఒక సంస్థకు డేటా ముఖ్యమన్నారు. కింది స్థాయి సిబ్బంది డేటా సక్రమంగా నిర్వహిస్తే ఆ సంస్థ విజయవంతంగా ముందంజలో ఉంటుదన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాచార నిర్వహణ అంతా డిజిటలైజేషన్ అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ఎఫ్‌డీసీ డైరెక్టర్ సుబ్బారావు, సిస్‌టాక్స్ సెల్స్‌హెడ్ ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అప్రమత్తం

- ఐపీఎస్ అధికారి సుస్మిత



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి సుస్మిత



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లలితాదేవి

కాకినాడ రూరల్: సైబర్ నేరాలు, రహదారి భద్రతపై విద్యార్థులు, ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని 2023 సివిల్ సర్వీసెస్ బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆర్.సుస్మిత తెలిపారు. శుక్రవారం స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ప్రొబేషనరీ ట్రైనింగ్‌లో ఉన్న సుస్మిత ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పాచయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుస్మిత మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రయాణం గురించి మాట్లాడారు. తాను తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కడలూరులోని ఓ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానన్నారు. తన సోదరి సైతం ఆల్ ఇండియా సర్వీసెస్‌లో ఐఏఎస్ అధికారి అయినందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నుంచి యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ సిద్ధం, సామాజిక సమస్యలు, ఇతర ప్రస్తుత అంశాలపై ఎన్నో ప్రశ్నలకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సమగ్ర సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ డి.అజయ్ రతన్, డాక్టర్ నాని బాబు, డాక్టర్ గోపీ తదితరులు పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

అవగాహన లేమి, భయం, తడబాటు, బలహీన వ్యక్తిత్వం, అత్యాశ తదితర కారణాలతో సైబర్ నేరాలు రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నందున అప్రమత్తంగా ఉండాలని సర్పవరం ఎస్సై లలితా దేవి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణాలకే పరిమితమైన సైబర్ నేరాలు నేడు గ్రామాలకీ వ్యాపించాయని, ఏదైనా సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ కి ఫోన్ చేయాలని, కొత్త నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినా, మెసేజ్ వచ్చినా స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, ఫోన్, బ్యాంక్ అకౌంట్, ఏటీఎం తదితర సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయవద్దన్నారు. పోలీసులమని చెప్పి భయపెడితే వారికి డబ్బులు పంపకుండా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో లలితా దేవిని సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధికారి ఉష, మాజీ సైనికోద్యోగి ఎస్.శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పి.పార్థసారథి, రాజా తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా తదితరులు

కాకినాడ సిటీ: ఏపీ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బెంచ్) అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె.శ్రీరమణి, డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావులతో కలిసి ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు



పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: ఈ నెల 27వ తేదీన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ డివిజన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీకి స్థానిక మెక్లారిన్ హైస్కూల్‌లో కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో 67 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 14 రూట్లుగా విభజించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, షామియానాలు, కుర్చీలు, పోలింగ్ సిబ్బందికి భోజన వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ పరిశీలనలో ఆర్డీవో వెంట అర్బన్ తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఈనెల 23వ తేదీ ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షల నేపథ్యంలో కాకినాడలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉందని, ఏ విధమైన జన సమూహంతో కూడిన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని, పరీక్షా కేంద్రం సమీపంలో జెరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఆదేశించారు.

భాషా ప్రావీణ్యంతో అగ్రస్థానానికి చేరవచ్చు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భాషా ప్రావీణ్యంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సాహితీవేత్త కొరుప్రోలు గౌరీనాయుడు పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, హిందీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీనాయుడు మాట్లాడుతూ సాంకేతిక వికాసంతో భాషా సాహిత్యాలు ప్రజలందరికీ చేరుతుతున్నాయన్నారు. భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ ద్వారా వృత్తి, ఉద్యోగ రంగాలలో రాణించవచ్చన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మాతృభాషతో పాటు ఆంగ్లం నేర్చుకోవాలన్నారు. పద్య సాహిత్యంలో ఉన్న మాధుర్యాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు. అనంతరం మాతృభాషపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, హిందీ విభాగాధిపతి పసుపులేటి హరిరామప్రసాద్, హైదరాబాద్ వర్సిటీ హిందీ విభాగాధిపతి నల్ల సత్యనారాయణ, దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రతినిధి శ్రీనివాసరావు, రాథోడ్ నారాయణ, అర్థశాస్త్ర విభాగాధిపతి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రాథమిక స్థాయి నుంచి తెలుగుభాషను అమలుచేయాలి

కాకినాడ రూరల్: ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు భాషను కచ్చితంగా అమలు చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా బోధనలో మాతృభాష ప్రాధాన్యాన్ని గుర్తించడమే మాతృభాషా దినోత్సవం అని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్.శ్రీ నగేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

బోట్‌క్లబ్: మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక ఐశ్వర్యాంబిక అమ్మవారి ఆలయంలో వేద పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దంత రక్షణపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా సంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో వేద పాఠశాల పండితులు శ్రీనివాస్ వరహాలరాజు, వైద్యులు శ్రీవల్లి, సిరాజ్ పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు

- ఆర్‌జేడీ నాగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ సిటీ: విద్యార్థులు శ్రద్ధగా చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర ప్రాథమిక విద్య ఆర్‌జేడీ జి.నాగమణి సూచించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ తమ సామాజిక బాధ్యతలో భాగంగా కాకినాడ దంటు కళాక్షేత్రంలో భైరవపాలెం, గాడిమొగ జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 160 మంది పదో తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలు, వ్యక్తిగత వికాసం, అవగాహనా కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షల్లో విజయం సాధించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పదో తరగతి అనంతరం ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిలయన్స్ సీఎస్సార్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఆర్ మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా భానుగుడి నుంచి కొండయ్యపాలెం వెళ్లే మిలటరీ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైయిన్లు, పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీకి సత్కారం



రామకృష్ణను సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: ఆటోలో నగలు మరచి దిగిపోయిన ప్రయాణికురాలి ఆభరణాలను భద్రంగా అప్పగించిన ఆ వాహనం డ్రైవర్‌ను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సత్కరించారు. వివరాల్లోకి వెళితే, అన్నవరానికి చెందిన ఊర సుధ అనే మహిళ కాకినాడలో బంధువుల ఇంట్లో వివాహానికి వచ్చి తిరిగి అన్నవరం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నగరంలో ఆటో ఎక్కి మరో ఆటో మారేందుకు సర్పవరం జంక్షన్‌లో దిగారు. పది కాసుల బంగారు నగల సంచిని తాను ప్రయాణిస్తున్న ఆటోలో మరిచిపోయారు. ఆటో వెళ్లిపోయిన కొద్ది సేపటికి జరిగిన విషయాన్ని గుర్తించి సర్పవరం పోలీసులకు తెలిపారు. ఆటో పెదపూడి వెళ్లిందన్న సమాచారంతో గాలిస్తుండగా తన ఆటోలో మహిళ బంగారు నగల్ని వదిలేసిన విషయాన్ని పెదపూడి ఆటోడ్రైవర్ యర్రంశెట్టి రామకృష్ణ గుర్తించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. కొద్ది సేపటికే సర్పవరం పోలీసుల నుంచి పెదపూడి పోలీసులకు సమాచారం అందింది. అప్పటికే రామకృష్ణ నగలను పోలీస్‌స్టేషన్‌లో అందించాడు. రామకృష్ణ నిజాయితీని తెలుసుకున్న ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకంగా కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి రామకృష్ణ దంపతులను ఆహ్వానించి సన్మానించారు. ఆటోడ్రైవర్ రామకృష్ణ నిజాయితీని, సర్పవరం ఎస్సై పి.శ్రీనివాసకుమార్, పెదపూడి ఎస్ఐ కె.రామారావు చొరవను ఎస్పీ అభినందించారు. రామకృష్ణతో సహా ఎస్ఐలకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వచ్చే నెల 8న లోక్ అదాలత్

కాకినాడ లీగల్: వచ్చే నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శుక్రవారం మూడో అదనపు జిల్లా కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణారావుపేటలోని శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి వారికి ఆలయ ధర్మకర్త మునగాల గురనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారు రామకృష్ణారావుపేటలోని పలు వీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

కాకినాడ క్రైం: వ్యక్తిగత కారణాలతో దుండగులు ఓ ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. కాకినాడలోని వార్ఫ్ రోడ్డులో జరిగిన ఈ ఘటనలో పెమ్మాడి అజయ్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన పల్సర్ వాహనానికి ఆగంతకులు శుక్రవారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

24 నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సమ్మె

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బ్యాంక్ యూనియన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలు అమలు చేయాలంటూ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఈ నెల 24, 25 తేదీలు సోమ, మంగళవారాల్లో దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటారని, బ్యాంక్ నగదు కార్యాకలాపాలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా క్లర్కులు, సబ్ స్టాఫ్, నియమకాలు వెంటనే చేపట్టాలని, తదితర డిమాండ్ల అమలుకు సమ్మె చేస్తున్నట్టు కాకినాడ బ్యాంక్ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి కె.ఆదినారాయణ శుక్రవారం తెలిపారు.

జన గణనతోనే కుల గణన

- త్వరలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అవగాహన ర్యాలీ
- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



జిల్లా అధ్యక్షుడు రమణకు నియామక పత్రం అందజేస్తున్న శంకరరావు

కాకినాడ రూరల్: జాతీయ స్థాయిలో ఈసారి జరిపే జన గణనతో పాటే కుల గణన జరపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కాకినాడలో నాగమల్లితోట జంక్షన్ వద్ద శుక్రవారం నిర్వహించిన బీసీ సంఘ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కుల గణన చేపట్టాల్సిన ప్రాధాన్యతను కేంద్రానికి తెలిసేలా ఉద్యమాలు, కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. చట్ట సభలో బీసీలకు సరైన రిజర్వేషన్లు కల్పించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా, మండల కమిషన్ సిఫారసులను సంపూర్ణంగా అమలు పరచాలన్నా బీసీ కుల గణన జరపవల్సి ఉందన్నారు. అనంతరం జిల్లా నూతన వర్గానికి నియామకపు పత్రాలు అందించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా గుత్తుల రమణ నియమితులవ్వడంతో ఆయనతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులకు నియామకపు పత్రాలు అందించారు.

ఏటీఎం కార్డు ఏమార్చి రూ.26 వేలు చోరీ

పిఠాపురం: ఏటీఎం సెంటర్‌లో డబ్బులు తీయడానికి ఇబ్బంది పడుతున్నట్లు నటించి తనకు డబ్బులు తీయడం రాదని, సాయం చేసిన వ్యక్తి దగ్గర ఏటీఎం కార్డును మార్చేసి డబ్బులు కాజేసాడు ఒక అగంతకుడు. స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద గురువారం జరిగిన ఘటనకు సంబంధించి బాదితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం సెంటర్ వద్దకు స్థానికుడు మాకినీడి త్రిమూర్తులు డబ్బులు డ్రా చేస్తున్నారు. ఇంతలో ఏటీఎం సెంటర్లోకి వచ్చిన ఓ వ్యక్తి తనకు డబ్బులు తీసుకోవడం రాదని డ్రాచేసి ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలో త్రిమూర్తులు తన కార్డును పక్కన పెట్టి అతని కార్డుతో డబ్బులు తీసే ప్రయత్నంలో ఉన్నాడు. ఇంతలో ఆ వ్యక్తి తన కార్డును త్రిమూర్తులు కార్డుతో మార్చేసి ఉడాయించాడు. తరువాత త్రిమూర్తులు తన కార్డుతో డబ్బులు తీసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అక్కడి సిబ్బంది కార్డు మారిపోయినట్టు గుర్తించారు. ఇంతలోనే అతని కార్డు నుంచి రూ.26 వేలు డ్రా అయినట్టు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన త్రిమూర్తులు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.